

**ఇంకా పనులు పూర్తికాలే..**
పెద్దగట్టు లింగమంతులస్వామి జాతరకు సమయం ముంచుకొస్తున్నా ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు.
- 8లో



**వైభవంగా ఎదుర్కోలు**
పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు.
- 10లో

గరిష్టం/కనిష్టం
32°/15°

**వాతావరణం**
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### ఇద్దరు లైన్‌మెన్ల బదిలీ

నల్లగొండ: విద్యుత్ శాఖలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు లైన్‌మెన్లపై వేటు పడింది. నల్లగొండ, మునుగోడులో పనిచేస్తున్న ఎస్‌వీ.రావు, నర్సింహ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో గురువారం నల్లగొండ విద్యుత్ శాఖ డీఈ శంకరయ్య వారిపై బదిలీ వేటు వేశారు. ఎస్‌వీ.రావును కట్టంగూర్ మండలం పిట్టంపల్లికి, నర్సింహను చెర్వుగట్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



బస్ పాస్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌ఎం శ్రీదేవి

నకిరేకల్: ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయడం చాలా సురక్షితమని, ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి సూచించారు. నకిరేకల్‌లో ని మెయిన్ సెంటర్‌లో గురువారం సాయంత్రం బస్ పాస్ కౌంటర్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికుల క్షేమం..వారిని సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడం ఆర్టీసీ లక్ష్యమన్నారు. ఈ బస్ పాస్ కౌంటర్ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు తెరచి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట బస్ డిపో మేనేజర్ సురేందర్, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, నకిరేకల్ ఆర్టీసీ కంట్రోలర్ మన్నాన్, రాధాకృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### పండిట్‌లు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయాలి

నల్లగొండ: తమను అప్‌గ్రేడ్ చేయాలని జిల్లాలో తెలుగు, ఉర్దూ ఇతర భాషా పండిట్‌లు, పీఈటీలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు వారు రెండు రోజుల నుంచి 9, 10 తరగతుల విద్యార్థులకు బోధన నిలిపేసి నిరసన తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయా విభాగాలకు చెందిన ఉపాధ్యాయులు పండిట్, పీఈటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారి, సంబంధిత స్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు వినతిపత్రాలు సమర్పించారు. గత ఏడాది హైదరాబాద్‌లో జరిగిన తెలుగు మహాసభల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పండిట్‌లు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చి జీఓ విడుదల చేశారని పేర్కొంటున్నారు. ఈ విషయం ప్రస్తుతం కోర్టులో ఉన్నందున దాన్ని క్లీయర్ చేసి తమకు స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారికి విన్నవించిన వారిలో పండిట్, పీఈటీల జేఏసీ బాధ్యులు రాములు, మీనయ్య, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళల కోసం పోస్టల్ పొదుపు పథకం

రామగిరి(నల్లగొండ): మహిళల కోసం పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో మహిళా సమ్మాన్ బచత్ పత్ర అనే మరో పొదుపు పథకం ప్రవేశపెట్టినట్లు ఆ శాఖ నల్లగొండ డివిజన్ సూపరింటెండెంట్ కె.రఘునాథ స్వామి తెలిపారు. జనవరి 28 నుంచి 31 వరకు జరిగిన ఏక్ దిన్ మే ఏక్ కరోడ్ మేఘా మేళాలో డివిజన్ పరిధిలో 6,964 వేల అకౌంట్లు తెరిచామని, అందులో 6,582 ఆర్డీ అకౌంట్లు ఉన్నట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో నెలవారీగా వడ్డీ పథకం వ్యక్తిగత అకౌంట్ వారికి రూ.4 లక్షల నుంచి రూ.9 లక్షలు, జాయింట్ అకౌంట్ ఉన్న వారికి రూ.9 లక్షల నుంచి రూ.15 లక్షలకు, వడ్డీ శాతం 6.7 నుంచి 7.1 శాతానికి పెంచారని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్ పొదుపు పథకం రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచగా వడ్డీ శాతం 7.6 నుంచి 8 శాతంకు పెంచారని తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా పీఎం స్వానిధి, ఆయుష్మాన్ భారత్, పీఎం ఎస్‌వైఎం, పీఎం ఎల్‌వీఎం సర్వీసెస్‌లు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు.

### పాఠశాల చిరునామా మార్చొద్దని ఉత్తర్వులు

డిండి : మండల పరిధిలోని కందుకూర్ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల చిరునామాను యథావిధిగా కొనసాగించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ ప్రశాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిగూడెంగా మార్చాలని ఉత్తర్వులు జారీ అయినప్పటి నుంచి విద్యార్థులు, స్థానిక అఖిలపక్ష నాయకులు నిరసన కార్యక్రమాలు చేపడుతుండడంతో విచారణ చేపట్టారు. అనంతరం పాఠశాల చిరునామాను కందుకూర్‌గానే ఉంచాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# ప్రభుత్వానికి ప్రతిపాదిస్తాం.. నిధులు రాబడతాం

**నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు**
- ప్రజావసరాలు ప్రస్తావించేందుకు ఎమ్మెల్యేలు సిద్ధం
- పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తిచేయడమే ఎజెండా
- సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, మౌలికవసతుల అంశాలను ప్రభుత్వం దృష్టికి తెస్తామని వెల్లడి

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కాబోతున్నాయి. ఈ ఏడాదే అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఈ ప్రభుత్వంలో ఇవే చివరి సమావేశాలు. ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రారంభమయ్యే సమావేశాల్లో మన ఎమ్మెల్యేలు ఏం మాట్లాడుతారనే ఆసక్తి ప్రజల్లో నెలకొంది. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులను అడుగుతామని జిల్లా ఎమ్మెల్యేలు చెబుతున్నారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు, చివరి దశలో ఉన్న బ్రాహ్మణ వెల్లంల పూర్తికి, సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన పనుల వేగవంతం వంటి అంశాలను ప్రస్తావించేందుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో రోడ్లు, పారిశుద్ధ్యం, డ్రైనేజీల అభివృద్ధి, సుందరీకరణకు అదనపు నిధులను అడుగుతామని చెబుతున్నారు. ఇక మారుమూల గ్రామాలు, గ్రామ పంచాయతీలుగా మారిన గిరిజన తండాల్లో రోడ్ల సదుపాయం వంటి సమస్యలను ప్రస్తావించి నిధులను రాబట్టుకునే ప్రయత్నం చేస్తామని పేర్కొంటున్నారు. బడ్జెట్ సమావేశాల్లో అవకాశం వస్తే ప్రస్తావించే అంశాలు వారి మాటల్లోనే...

– సాక్షి ప్రతినిధి, నల్లగొండ



### రోడ్ల నిర్మాణాలకు నిధులు రాబడుతా..



సాగర్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషి చేస్తా. అంతర్గత రహదారుల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరుతా. నిడమనూరు మండలం తుమ్మడం నుంచి తిరుమలగిరి(సాగర్) మండలం డొక్కలబాయి తండా మీదుగా అల్వాల నుంచి దేవరకొండ రహదారి వరకు డబుల్ రోడ్డు, పెద్దవూర మండలం వెల్మగూడెం నుంచి గర్నెకుంట వరకు డబుల్ రోడ్డు, అనుముల మండలం చల్మారెడ్డిగూడెం–పుల్లారెడ్డిగూడెం గ్రామాల మధ్య అహల్య వాగుపై నూతన వంతెన నిర్మాణాల కోసం నిధుల కేటాయింపుపై ప్రస్తావిస్తా. నియోజకవర్గంలో చెక్ డ్యాముల నిర్మాణానికి టెండర్లు పిలడం వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.

– నోముల భగత్, ఎమ్మెల్యే, నాగార్జున సాగర్

### పరిహారం డబ్బులపై ప్రస్తావిస్తా



కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న వ్యవసాయ భూములకు పరిహారంతో పాటు బీఎన్ తిమ్మాపూర్ నిర్వాసితుల కోసం భువనగిరి శివారులో నిర్మిస్తున్న పునరావాస గ్రామంలో మౌలిక వసతులకు నిధుల విషయమై అసెంబ్లీలో ప్రస్తావిస్తా. జిల్లా కేంద్ర ఆస్పత్రి స్థాయిని 250 పడకలకు పెంచాలని కోరుతా. భువనగిరి నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లకు నిధులు కేటాయింపుపై చర్చిస్తా.

–పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే, భువనగిరి

### కొత్త రోడ్ల కోసం నిధులు అడుగుతా



వర్షాలకు ఆలేరు నియోజకవర్గంలో రహదారులు దెబ్బతిన్నాయి.దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో రహదారుల రెన్యూవల్ అంశాన్ని ప్రస్తావించడంతో పాటు కొత్త రోడ్లు కావాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధుల గురించి చర్చిస్తా. బడ్జెట్ రైతులకు, అన్ని రంగాల ప్రజలకు అనుకూలంగా ఉంటుంది.

–గొంగిడి సునీత, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, ఆలేరు

### కళాశాలల ఏర్పాటు విషయం ప్రస్తావిస్తా



నల్లగొండకు రింగు రోడ్డుతోపాటు నియోజకవర్గానికి స్పోర్ట్స్ విలేజ్, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్, ఫార్మసి, హార్టికల్చర్ కళాశాలలను మంజూరుకు కృషి చేస్తా. ఈ విషయాలను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి మంజూరు అయ్యేలా చూస్తా. ఇప్పటికే నల్లగొండ పట్టణాన్ని ముఖ్యమంత్రి దత్తత తీసుకొని భారీగా నిధులు మంజూరు చేయడంతో పట్టణ సుందరీకరణ, ఐటీ హబ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. మెడికల్ కళాశాలతోపాటు వెటర్నరీ, బీఎస్సీ నర్సింగ్ కళాశాలు మంజూరయ్యాయి. అదేవిధంగా నల్లగొండలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు కూడా మరింత వేగంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతాను.

– కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లగొండ

### మిర్యాలగూడ జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతా..



నేటి నుంచి జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నియోజకవర్గంలో లిఫ్టులు, చెక్‌డ్యాంలు, పట్టణ రోడ్లతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు, మహిళా కళాశాల, ఐటీఐ, పాలటెక్నిక్, దళితబంధు, డబుల్‌బెడ్‌రూం తదితర అంశాలపై ప్రస్తావిస్తా. ముఖ్యంగా మిర్యాలగూడను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో కోరుతా. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి రూ.400కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

– నల్లమోతు భాస్కర్‌రావు, ఎమ్మెల్యే, మిర్యాలగూడ

### సాగునీటి ప్రాజెక్టుల అంశాన్ని లేవనెత్తుతా



మునుగోడు నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారు. ఆగిపోయిన అభివృద్ధిని పరుగులు పెట్టించడమే నా ప్రధాన కర్తవ్యం. అందులో భాగంగా నియోజకవర్గంలోని శివన్నగూడెం, లక్ష్మణాపురం రిజర్వాయర్ల అంశాన్ని అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తుతా. బీడు భూములకు సాగునీరు అందించే ఈ రెండు ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసే అంశంపై మాట్లాడుతా. విద్య, వైద్యం, రహదారుల నిర్మాణంతో పాటు ఇతర ప్రధాన అంశాలను ప్రస్తావిస్తాను. నియోజకవర్గంలోని సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు అవసరమైన నిధులను సాధించడమే లక్ష్యంగా అసెంబ్లీ సమావేశాలను సద్వినియోగం చేసుకుంటాను.

–కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే, మునుగోడు

### పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరుతా..



దేవరకొండ నియోజకవర్గం పరిధిలో పురోగతి, పెండింగ్‌లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టుల గురించి అసెంబ్లీ శాసన సభ సమావేశాల్లో ప్రస్తావిస్తా. ఇప్పటికే మంజూరై, కొనసాగుతున్న ప్రాజెక్టుల నిర్మాణాలు, నిధుల మంజూరుతో పాటు లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరుతా. అదేవిధంగా దేవరకొండ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరీకి సంబంధించిన అంశాన్ని సభ దృష్టికి తీసుకెళ్తా. దేవరకొండ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు నావంతు కృషి చేస్తా.

– రమావత్ రవీంద్రకుమార్, ఎమ్మెల్యే, దేవరకొండ

### ఎస్సారెస్పీ కాల్వల ఆధునీకరణకు నిధులపై చర్చిస్తా



తుంగతుర్తి నియోజకవర్గం నుంచి వెళ్తున్న ఎస్సారెస్పీ కాల్వల ఆధునీకరణకు నిధుల మంజూరు విషయాన్ని ప్రస్తావిస్తా . ఆ నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తా. నియోజకవర్గంలో వంద పడకల ఆస్పత్రి మంజూరైంది. దీనిపై అధికారిక ప్రకటన వచ్చే విధంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకెళ్తా. తుంగతుర్తి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో చర్చిస్తా.

– గాదరి కిషోర్‌కుమార్, ఎమ్మెల్యే, తుంగతుర్తి

### అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను రెగ్యులరైజ్ చేయాలని, గ్రామాల్లో పని చేస్తున్న వీఓఏలకు కూడా ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి అసెంబ్లీలో ప్రస్తావిస్తా. గ్రామాల్లో లింక్ రోడ్లుకు నిధులు కేటాయించాలని కోరుతా. నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పనులకు నిధుల కేటాంపు విషయాన్ని సభ దృష్టికి తెస్తా.

– బొల్లం మల్లయ్యయాదవ్, ఎమ్మెల్యే, కోదాడ

# సర్పంచ్‌లపై అవినీతి మరకలు !

- అక్రమాలకు పాల్పడుతున్నారంటూ వెల్లువెత్తుతున్న ఆరోపణలు
- నాలుగేళ్లలో 80 మందిపైన..
- తాజాగా పర్వతగిరి సర్పంచ్, కార్యదర్శులపై ఫిర్యాదు
- ఎంబీలు లేకుండా రూ.50 లక్షలు డ్రా చేశారని సోషల్ మీడియాలో వైరల్
- విచారణకు ఆదేశించిన డీపీఓ

నల్లగొండ: జిల్లాలో కొందరు సర్పంచ్‌లు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి పనులు చేపట్టకుండానే ఎంబీ రికార్డులు లేకుండా బిల్లులు డ్రా చేయడం, నాణ్యత లేకుండా తక్కువ పనుల చేసి ఎక్కువ బిల్లులు చేస్తూ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని పలువురు సర్పంచ్‌లపై ఫిర్యాదులు సైతం చేసిన ఘటనలు ఉన్నాయి. నాలుగేళ్ల నుంచి జిల్లా వ్యాప్తంగా దాదాపు 80మందికిపైగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నాట్లు సమాచారం.

**పర్వతగిరి సర్పంచ్, కార్యదర్శులపై..**

తాజాగా కనగల్ మండలం పర్వతగిరి గ్రామ సర్పంచ్‌తోపాటు పంచాయతీ కార్యదర్శి సైతం అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే గ్రామంలో చేపట్టిన రూ.2కోట్ల నిధులకు సంబంధించిన పనులతోపాటు ఉద్యోగుల వేతనాలకు ఖర్చు చేశారు. అందులో ఎలాంటి ఎంబీలు లేకుండా రూ.50 లక్షల నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ జిల్లా కలెక్టర్, డీపీఓలకు గ్రామానికి చెందిన విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై ఓ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయంపై డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి స్పందించి నల్లగొండ డీఎల్‌పీఓను విచారణకు ఆదేశించారు. దీంతో గ్రామంలో విచారణ కొనసాగుతోంది.

**నాలుగేళ్లలో 80 మందిపై ఆరోపణలు**

జిల్లాలో సర్పంచ్‌ల పదవీకాలం నాలుగేళ్లు పూర్తయింది. ఇప్పటి వరకు 80 మంది సర్పంచ్‌లపై అవినీతి ఆరోపణలు రాగా వారిపై విచారణకు ఆదేశించారు. కొందరిపై విచారణ చేసి చర్యలు తీసుకున్నాం. మరికొందరిపై విచారణ కొనసాగుతోంది.

– విష్ణువర్ధన్‌రెడ్డి, డీపీఓ, నల్లగొండ

# ఫార్మా అనుమతులు రద్దుచేయాలి



కంపెనీ నిర్మాణ స్థలం వద్ద ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

- తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి

మునుగోడు: కాలుష్యానికి కారమయ్యే ఫార్మా కంపెనీ నిర్మాణ అనుమతులు వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మేరెడ్డి శ్యాంప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కిష్టాపురం గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ వద్ద గురువారం మండలంలోని అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఫార్మా కంపెనీ నిర్మిస్తే ఈ ప్రాంతంలోని వాగుల్లో భూగర్భ జలాలు కలుషితమవుతాయన్నారు. ఎలాంటి సాగు నీటి వనరులు లేని ఈ ప్రాంతంలో వాగుపై చెక్ డ్యాంమ్‌లు నిర్మించారని, ఫార్మా కంపెనీ నిర్మిస్తే ఆ నీరంతా కలుషితమై పంటలు పండని పరిస్థితి నెలకొంటుందన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజల అభిప్రాయాలను తీసుకొని అనుమతులు ఇవ్వాలి తప్ప అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహ రించడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ఫార్మా కంపెనీ నిర్మాణానికి ఇచ్చిన అనుమతి రద్దు చేయకుంటే స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి తమ ఫోరం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామి, ఇప్పర్తి, పలివెల, చీకటిమామిడి, కొంపల్లి, ఊకొండి, కోతులారం సర్పంచ్‌లు బొజ్జ సుజాతశ్రీను, గజ్జల బాలరాజుగౌడ్, తాటికొండ సంతోషసైదులు, నడిపల్లి యాదయ్య, జాజుల పారిజాత సత్యనారాయణ, ఎంపీటీసీలు భీమనపల్లి సైదులు, విజయలక్ష్మిసైదులు, చెరుకు కృష్ణయ్య, నిర్మలశరత్‌బాబు, బొడ్డు శ్రావణి నాగరాజుగౌడ్, నాయకులు దాడి శ్రీనివాస్‌రెడ్డి, భవనం శ్రీనివాస్‌రెడ్డి, బూడిద లింగయ్య యాదవ్, పి.సైదులు, బోయ లింగస్వామి పాల్గొన్నారు.

# పదకొండు రోజుల్లో 94,818 మందికి..

**ముమ్మరంగా 'కంటి వెలుగు' పరీక్షలు**
- ఇప్పటి వరకు 16,679 మందికి అద్దాలు అందజేత
- శిబిరాలకు తరలి వస్తున్న ప్రజలు
- మూడు నెలల పాటు కొనసాగనున్న కార్యక్రమం



ఐఎంఏ భవన్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



నల్లగొండ జిల్లా కేంద్రంలో కంటి పరీక్షల కోసం బారులుదీరిన ప్రజలు

నల్లగొండ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి జిల్లాలో విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమం ఈ నెల 19న ప్రారంభం కాగా మొత్తం 11 రోజులుగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో 94,818 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో పురుషులు, 45,835, స్త్రీలు 48,962మంది, ట్రాన్స్‌జెండర్స్ 21మంది ఉన్నారు. వీరిలో అవసరం ఉన్న 16,679 మందికి కంటి అద్దాలను అందజేశారు. దృష్టి లోపం ఉన్న 10,800 మందికి అవసరమైన కంటి అద్దాల కోసం ప్రభుత్వానికి నివేదించారు. అలాంటి వారందరికీ ప్రభుత్వం నుంచి కంటి అద్దాలు రాగానే నేరుగా వారి ఇంటికే ఆశ వర్కర్ల ద్వారా పంపించనున్నారు. కంటి పరీక్షల శిబిరాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

**శిబిరాల వద్ద ప్రజల బారులు**

కంటి వెలుగు శిబిరాల వద్ద కంటి పరీక్షల కోసం ప్రజలు బారులుదీరుతున్నారు. బయట డాక్టర్ల వద్ద కంటి పరీక్షలు చేయించుకోవాలంటే డాక్టర్ ఫీజు, కంటి అద్దాల కోసం డబ్బులు వెచ్చించడంతో పాటుగా పట్టణాలకు వచ్చి చేయించుకోవాలిస్న పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న కంటి వెలుగు ద్వారా వారి గ్రామాలు, పట్టణాలలోని వార్డులెకల పరీక్షలను ఉచితంగా చేస్తుండడంతో ప్రజలు పెద్దఎత్తున శిబిరాలకు వస్తున్నారు. కంటి అద్దాలు అవసరం లేని వారికి కంట్లో వేసుకునే డ్రాప్స్, ఇతర ట్యాబ్లెట్లను ఉచితంగా అందజేస్తున్నారు. మూడు నెలలు పాటు నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా సుమారు 8 లక్షల మందికి ఉచితంగా కంటి పరీక్షలను చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు.

**74 బృందాల ద్వారా పరీక్షలు**

జిల్లా వ్యాప్తంగా కంటి పరీక్షలు నిర్వహించడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ 74 బృందాలను ఏర్పాటు చేసింది. అందులో మెడికల్ ఆఫీసర్, పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్, డేటాఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ముగ్గురు ఆశ వర్కర్లను నియమించారు. ఉదయం 9 గంటలకు నిర్దేశించిన చోట్లకు వైద్య బృందాలు వెళ్లి 18 ఏళ్లు నిండిన వారికి ఉచితంగా కంటి పరీక్షలు చేస్తున్నాయి. పట్టణాల్లో ప్రతిరోజు 400 మందికి, గ్రామాల్లో 300 మందికి కంటి పరీక్షలు చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 68,900 రీడింగ్ అద్దాలను పంపించింది. మిగతా అద్దాలు త్వరలో పంపనుంది.

**అద్దాలు త్వరగా అందజేయాలి**



కంటి పరీక్షలను చేసిన తర్వాత కంటి అద్దాలను వెంటనే ఇస్తే బాగుంటుంది. దృష్టిలోపం ఉందని అద్దాలు తెప్పించి ఇస్తామంటున్నారు. ఎప్పుడు ఇస్తారో చూడాలి. వెంటనే ఇచ్చేలా చూస్తే బాగుంటుంది.

– సుశీల, నల్లగొండ

**కంటి అద్దాలు బాగున్నాయి**



కంటి పరీక్షలు చేసిన తర్వాత ఇచ్చిన అద్దాలు చాలా బాగున్నాయి. కంటి చూపు ఇప్పుడు బాగా ఉంది. పేదలకు ప్రభుత్వం ఉచితంగా కంటి పరీక్షలను చేయించడంతో ఎంతో మేలు కలుగుతుంది.

– గౌస్, నల్లగొండ

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**



రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమంలో ఉచితంగా కంటి పరీక్షలు చేయిస్తోంది. కంటి అద్దాలను కూడా ఉచితంగా ఇస్తోంది. కంటి వెలుగు శిబిరాలను ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ అనిమళ్ల కొండల్‌రావు తదితరులు

నల్లగొండ టౌన్: గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్న పిల్లల కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు అన్నారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి, నల్లగొండ డీఈఐసీ (డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్) సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉమ్మడి జిల్లాకు చెందిన 0–18 సంవత్సరాల పిల్లల కోసం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని 14 మొబైల్ హెల్త్ టీంలకు చెందిన వైద్యాధికారులు గుర్తించిన 157 మంది 18 సంవత్సరాల లోపు పిల్లలకు ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పి.సుదీప్‌రెడ్డి గుండె పరీక్షలను నిర్వహించారన్నారు. అందులో 56 మంది పిల్లలకు ఆపరేషన్ ద్వారా చికిత్సలు చేయాలని గుర్తించినట్లు తెలిపారు. 56 మందిలో తక్షణమే ఐదుగురు చిన్నారులకు శస్త్ర చికిత్సలు అవసరమని వారిని నాలుగైదు రోజుల్లో ఆర్‌బీఎస్‌కే మొబైల్ టీం వైద్యాధికారులు సికింద్రాబాద్‌లోని కృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తీసుకెళ్తారన్నారు. శస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీ, ఎన్జీఓలు, ప్రైవేట్ ఫౌండేషన్ల సహాయంతో చేయించడం జరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కిరణ్, డీఐఓ డాక్టర్ రాంమోహన్ సూర్యాపేట డీఐఓ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ రమేష్, కిమ్స్ డాక్టర్లు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 'హైవే దిగ్బంధనం' జయప్రదం చేయాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

నకిరేకల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 13న చేపట్టబోయే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. నకిరేకల్ పట్టణంలోని నారాయణరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఇతర అనుబంధ సంఘాల రాష్ట్ర కమిటీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత 29 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్న బీజేపీ, నేడు సంపూర్ణ మెజార్టీతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ ఎలా అధికారంలోకి వస్తుందో చూస్తామన్నారు. సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు మాచర్ల సైదులు మాదిగ, వివిధ సంఘాల రాష్ట్ర బాధ్యులు కందుకూరి సోమన్న, కందికంటి అంజయ్య, బోడ సునీల్, ప్రదీప్, గోవిందు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### నృసింహుడికి సంప్రదాయ పూజలు



ఉత్సవమూర్తులకు హారతి ఇస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య పూజలు సాంప్రదాయంగా కొనసాగాయి. వేకువజామునే ప్రధానాలయాన్ని తెరచిన ఆచార్యులు స్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి తులసీదళాలతో అర్చన చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలోని ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహా హోమం, గజవాహనసేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలు చేపట్టారు. సాయంత్రం జోడు సేవోత్సవం, సహస్ర నామార్చన వంటి పూజలను జరిపించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

# ఇంకా పనులు పూర్తికాలే..

**రెండు రోజుల్లో పెద్దగట్టు జాతర**

- ఎక్కడి పనులు అక్కడే
- పూర్తికాని సీసీ కెమెరాల బిగింపు, తలుపులు లేకుండానే దర్శనమిస్తున్న మరుగుదొడ్లు
- భక్తుల రద్దీకి అనుగుణంగా గుట్టపై చదును చేయని స్థలం



చెరువులో ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్స్



తలుపులు బిగించని మరుగుదొడ్లు



గుట్టపై భక్తులు స్నానాలు చేసేందుకు ఏర్పాటు కాని షవర్లు

చివ్వెంల (సూర్యాపేట): తెలంగాణ రాష్ట్రంలో రెండో అతిపెద్దదైన పెద్దగట్టు లింగమంతులస్వామి జాతరకు ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరగనుంది. 200 ఏళ్ల చరిత్ర గల ఈ జాతరను ప్రతి రెండేళ్లకోసారి వైభవంగా జరుపుకుంటారు. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీలింగమంతులస్వామి, చౌడమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఈసారి జాతర పనులు ఏవిధంగా సాగుతున్నాయో చూడటానికి గురువారం సాక్షి పెద్దగట్టు పరిసరాలను విజిట్ చేయగా చాలా వరకు పనులు నిదానంగా సాగుతున్నాయి.

**రూ. 5 కోట్లు మంజూరు..**

ఈసారి జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వం నుంచి రూ.5కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో జాతర వద్ద మౌలిక వసతులతో పాటు ఇతర పనులు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. ఈ నిధులను పంచాయతీరాజ్ శాఖకు రూ.1.09 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్‌కు రూ.37లక్షలు, విద్యుత్ శాఖకు రూ.40లక్షలు, రెవెన్యూ శాఖకు రూ.44 లక్షలు, అగ్నిమాపక శాఖకు రూ.2.25 లక్షలు, ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.17 లక్షలు, దేవాదాయ శాఖకు రూ.50 లక్షలు, పోలీస్‌శాఖకు రూ.18 లక్షలు, వైద్యశాఖకు రూ.5లక్షల చొప్పున కేటాయించారు. వీటితో పాటు రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ తన నిధుల నుంచి యాదవుల కోసం కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేశారు.

**గుట్టపై ప్రారంభ దశలోనే..**

జాతర నేపథ్యంలో పెద్దగట్టుపై ఉన్న శ్రీలింగమంతులస్వామి, చౌడమ్మ తల్లి ప్రధాన ఆలయం సుందరంగా ముస్తాబైంది. దేవాలయానికి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. ప్రధాన ఆలయం చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లు వేశారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో గుట్టపై ప్రస్తుతం ఉన్న స్థలం ఏమాత్రం సరిపోవడం లేదు. ఇందుకోసం గుట్టపై స్థలాన్ని చదును చేసే పనులు మొదలుపెట్టినా అవి ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. జాతరకు ఐదారు రోజులు ఉండనగా ఈ పనులు మొదలుపెట్టడం గమనార్హం. కనీసం జాతర పూర్తయ్యే నాటికైనా ఈ పనులు ముగుస్తాయో.. లేదో తెలియని పరిస్థితి. కాగా లక్షలాది మంది భక్తుల భద్రత కోసం ఏర్పాటు చేయాల్సిన సీసీ కెమెరాలను ఇంకా బిగించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

**గుట్టకింద అసంపూర్తిగా..**

గుట్టకింద ప్రధానంగా తాగునీరు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణం, వసతి, వాహనాల పార్కింగ్ కోసం లీజుకు తీసుకున్న 25 ఎకరాల స్థలాన్ని చదును చేయడం, కోనేరు శుభ్రం, మొబైల్ టాయిలెట్ల ఏర్పాటు, చెరువు చుట్టూ, కట్టపై బారికేడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర పనులు చేయాల్సి ఉంది. ఇందులో తాగునీటి సరఫరాకు కుళాయిలు నిర్మించినా, వాటికి నల్లాలు బిగించలేదు. గతంలో ఉన్న 100 మరుగుదొడ్లకు మరమ్మతులు చేసినా ఇంకా తలుపులు బిగించలేదు. మొబైల్ టాయిలెట్ల ఏర్పాటు కోసం గుంతల తవ్వకం పూర్తికాకపోగా.. మరికొన్ని మరుగుదొడ్లు చెరువులో నిరుపయోగంగా ఉన్నాయి. రంగులు వేసే పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. జాతర వద్ద విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు జనరేటర్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇంతవరకు ఆ ఊసే లేకుండా పోయింది. భక్తుల వసతి కోసం చదును చేయాల్సిన స్థలాలు అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. ఇక ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ నిధులతో చేపడుతున్న యాదవ కమ్యూనిటీ భవనం పనులు ప్రారంభం దశలోనే ఉండడం గమనార్హం.

## సబ్బండ వర్గాల అభ్యున్నతే కేసీఆర్ లక్ష్యం

- సూర్యాపేటకు తలమానికం పెద్దగట్టు లింగమంతులస్వామి
- బీఆర్ఎస్ హయాంలోనే గట్టు అభివృద్ధి
- యాదవులకు భేరీల పంపిణీలో మంత్రి జగదీశ్‌రెడ్డి



భేరీలను పంపిణీ చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: రాష్ట్రంలోని సబ్బండ వర్గాల అభ్యున్నతే సీఎం కేసీఆర్ లక్ష్యమని, తెలంగాణలో ప్రతీ వర్గం, కులం బాగుపడాలన్నదే ఆయన సంకల్పమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరను పురస్కరించుకుని గురువారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన యాదవులకు సంప్రదాయ దుస్తులు, 150 భేరీలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని సంస్కృతులు, సంప్రదాయాలకు గౌరవం లభించేది దేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే అని అన్నారు. 2014కు ముందు పెద్దగట్టును పాలకులు పట్టించుకోలేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాకే రూ.15కోట్లతో గట్టుపై శాశ్వత నిర్మాణాలు చేపట్టామన్నారు. భక్తుల కోసం శాశ్వత మంచినీటి ట్యాంక్, గెస్ట్ హౌజ్, పూజారి నివాసం, కోనేరు నిర్మాణం, మహిళ కోసం గదుల వంటి నిర్మాణాలను చేపట్టామని తెలిపారు. కేసీఆర్ పాలన కోసం దేశవ్యాప్తంగా ప్రజలంతా ఎదురు చూస్తున్నారని, యాదవ సమాజం కూడా కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు అండగా నిలవాలన్నారు.

**బీఆర్ఎస్‌లో మాజీ చైర్మన్ చేరిక**

గత ప్రభుత్వ హయాంలో ఏనాడూ లేని విధంగా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పెద్దగట్టు అభివృద్ధికి చేస్తున్న కృషికి ఆకర్షితుడైన గట్టు మాజీ చైర్మన్ మద్ది శ్రీనివాస్ యాదవ్ కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పి మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులుయాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడా దుస్తులు పంపిణీ



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి

సూర్యాపేట: బిహార్ రాజధాని పాట్నాలో జరిగే జాతీయ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనడానికి వెళ్తున్న సూర్యాపేట జిల్లా జట్టును గురువారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. 15మంది విద్యార్థినీ, విద్యార్థులకు మంత్రి క్రీడా దుస్తులు పంపిణీ చేసి ప్రయాణ ఖర్చులు అందజేశారు. అథ్లెటిక్స్ పోటీల్లో రాణించి సూర్యాపేట జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని ఆయన ఆకాంక్షించారు.

## బీఆర్ఎస్ అధ్యక్ష పదవికి రాజీనామా

- కార్యకర్తలకు న్యాయం చేయలేని పదవి ఎందుకు
- సామాన్య కార్యకర్తగా కొనసాగుతా
- ముత్యాల సర్వయ్య



ముత్యాల సర్వయ్య

చందంపేట: చందంపేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల సర్వయ్య తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గురువారం చందంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మండల అధ్యక్షునిగా ఉంటూ సామాన్య కార్యకర్తకు ఏవిధమైన న్యాయం చేయలేని పరిస్థితిలో ఉన్నానని, అలాంటప్పుడు ఈ అధ్యక్ష పదవి తనకు అవసరం లేదని పేర్కొన్నారు. ఇక నుంచి బీఆర్ఎస్‌లో సామాన్య కార్యకర్తగానే కొనసాగుతానని అన్నారు. సర్వయ్య 1995లో కాంగ్రెస్ పార్టీ తరఫున కంబాలపల్లి సర్పంచ్‌గా, 2006లో చందంపేట ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2014లో బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆయన మండల పార్టీ అధ్యక్షునిగా వ్యవహరించారు. ఇటీవల పార్టీలో తగిన ప్రాధాన్యం లభించడం లేదని ఆయన భావిస్తున్నారు. సామాన్య కార్యకర్తకు తనవంతుగా న్యాయం చేయలేకపోతున్నాననే ఆవేదనతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వయ్య భార్య ప్రస్తుతం కంబాలపల్లి గ్రామ సర్పంచ్‌గా కొనసాగుతుండగా, కుమారుడు చంద్రశేఖర్ కంబాలపల్లి ఎంపీటీసీగా ఉన్నారు.

## క్రీడా మైదానానికి కేటాయించిన భూమిని కాపాడాలి



క్రీడా మైదానం ఏర్పాటు కోసం కేటాయించిన భూమిని పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ: మిర్యాలగూడ మండలంలోని ఐలాపురంలో క్రీడా మైదానం ఏర్పాటు చేసేందుకు కేటాయించిన భూమి ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం ఐలాపురంలోని సర్వే నంబర్ 15లో గల భూమిని ఆయన పరిశీలించి మాట్లాడారు. సర్వే నంబర్ 15లో గల భూమిని క్రీడా మైదానం కోసం కేటాయించారని, దానిని స్థానిక సర్పంచ్ ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, ఇప్పటికే ఆ భూమి చుట్టూ కంచె వేశారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కంచెను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, నాయకులు హనుమానాయక్, బానోతు వెంకటేశ్వర్లు, కృష్ణానాయక్, నాగేశ్వర్‌రావు, సాయన్న, అశోక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పెద్దగట్టు జాతర బందోబస్తుపై సమీక్ష

- వాహనాల మళ్లింపు రూట్ మ్యాప్ విడుదల చేసిన ఎస్పీ రాజేంద్రప్రసాద్
- 1850 మంది పోలీసు సిబ్బంది, 500 మంది వలంటీర్లతో పటిష్టమైన పోలీసు బందోబస్తు



రూట్ మ్యాప్ విడుదల చేస్తున్న ఎస్పీ

సూర్యాపేట క్రైం: పెద్దగట్టు జాతర పోలీసు బందోబస్తుపై గురువారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాజేంద్రప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై వాహనాల మళ్లింపు, జాతరకు వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలకు సంబంధించిన రూట్ మ్యాప్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 1850 మంది పోలీసు సిబ్బంది, 500 మంది వలంటీర్లతో పటిష్టమైన పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజూ మూడు విడతల్లో 24 గంటలు సిబ్బంది విధులు నిర్వహిస్తారని, జాతర పరిసరాల్లో పోలీసు కంట్రోల్‌రూం, హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులు, వాహనదారులు పోలీసు వారి సూచనలు పాటిస్తూ సహకరించాలన్నారు.

**వాహనాల మళ్లింపు ఇలా..**

- హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను టేకుమట్ల వద్ద ఖమ్మం వెళ్లే జాతీయ రహదారి 365బీబీ మీదుగా మళ్లించి, రాఘవపురం స్టేజీ, నామవరం, గుంజలూరు స్టేజీ మీదుగా విజయవాడ వైపుపంపించనున్నారు.
- విజయవాడ వైపు వెళ్లే భారీ, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను టేకుమట్ల నుంచి జాతీయ రహదారి 365బీబీ మీదుగా మళ్లించి, నాయకునిగూడెం మీదుగా కోదాడ వైపు పంపించనున్నారు.
- విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను స్వామి నారాయణ్ గురుకుల్ స్కూల్ ఎదురుగా ఉన్న ఎస్ఆర్ఎస్పీ కెనాల్ రోడ్డు మీదుగా ఖమ్మం జాతీయ రహదారి 365బీబీ రోల్లబండ తండా వరకు మళ్లించి రాయినిగూడెం వద్ద యూటర్న్ చేసి హైదరాబాద్ వైపు పంపించనున్నారు.
- విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను కోదాడ, నేరేడుచర్ల, మిర్యాలగూడ, నల్గొండ, నార్కట్‌పల్లి మీదుగా పంపించనున్నారు.
- కోదాడ, మునగాల మీదుగా సూర్యాపేట పట్టణానికి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర చిన్న ప్రజా రవాణా వాహనాలను ఎస్సార్ఎస్పీ కెనాల్ నుంచి బీబీగూడెం మీదుగా సూర్యాపేట పట్టణానికి పంపించనున్నారు.
- సూర్యాపేట పట్టణం నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రజా రవాణా వాహనాలను కుడకుడ గ్రామం మీదుగా ఐలాపురం వద్ద ఖమ్మం జాతీయ రహదారి 365బీబీ పైకి మళ్లించి రాఘవపురం స్టేజీ, నామవరం, గుంజలూరు స్టేజీ మీదుగా కోదాడ వైపు పంపించనున్నారు.

పార్కింగ్ నిమిత్తం 4 అంతకన్నా ఎక్కువ చక్రాలు గల వాహనాలకు 4 భారీ పార్కింగ్ ప్రదేశాలను, ద్విచక్ర వాహనాలకు కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

- మొదటి పార్కింగ్ ప్రదేశం: సూర్యాపేట మీదుగా జాతరకు వచ్చే భక్తుల వాహనాలను ఎన్‌హెచ్ 65 మీద గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి రామకోటి తండాకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో నిలపాల్సి ఉంటుంది.
- రెండవ పార్కింగ్ ప్రదేశం : గరిడేపల్లి, పెన్‌పహాడ్ నుంచి జాతరకు వచ్చే భక్తుల వాహనాలను కలెక్టర్ కార్యాలయం వెనుక పార్కింగ్ చేయాలి.
- మూడవ పార్కింగ్ ప్రదేశం : కోదాడ, మునగాల, గుంపుల వైపుగా వచ్చే వాహనాలను ఖాసీంపేట గ్రామానికి వెళ్లే మార్గంలో పార్కింగ్ చేయాలి.
- నాల్గో పార్కింగ్ ప్రదేశం : మోతె, చివ్వెంల మీదుగా వచ్చే వాహనాలను చివ్వెంల మీదుగా మళ్లించి మున్యానాయక్ తండా వద్ద(గట్టుకు వెనకాల) పార్కింగ్ చేయాల్సి ఉంటుంది.
- వీఐపీ పార్కింగ్ : వీఐపీల వాహనాల కోసం పెద్దగట్టు తూర్పు మెట్లకు ఎదురుగా పార్కింగ్ స్థలం కేటాయించడం జరిగింది.

సమావేశంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వరరెడ్డి, రవి, సీఐలు సోమనారాయణ్ సింగ్, శ్రీనివాస్, నాగార్జున, పీఎస్‌డీ ప్రసాద్, నరసింహ, గౌరినాయుడు, ఆర్ఐలు శ్రీనివాసరావు, శ్రీనివాస్, నరసింహారావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు

చివ్వెంల: పెద్దగట్టు జాతర నేపథ్యంలో గురువారం బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. భక్తుల భద్రత దృష్ట్యా జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ అడ్మిన్ ఆర్. శ్రీనివాస్‌రావు తెలిపారు.



## బాలెంల పాఠశాలలో విద్యార్థుల పస్తులు

- వంట చేయని మధ్యాహ్నం భోజన ఏజెన్సీ సభ్యులు
- డబ్బుల విషయంలో వివాదంతో విధుల బహిష్కరణ

సూర్యాపేట రూరల్: మండల పరిధిలోని బాలెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనం వండే ఏజెన్సీ సభ్యులు వంట చేయకుండా విద్యార్థులను పస్తులు ఉంచారు. గత ఆరు నెలలుగా వంట చేసిన డబ్బుల విషయమై రెండు సంఘాల మధ్య వివాదం జరుగుతుండగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదు. దీంతో గురువారం వారు వంట చేయలేదు. వంట చేసే సంఘం ఖాతాలో కాకుండా మరో సంఘం ఖాతాలో డబ్బులు పడటమే ఈ వివాదానికి కారణమైనట్లు తెలుస్తుంది. అయితే పక్కనే ప్రాథమిక పాఠశాల ఉన్నా ప్రధానోపాధ్యాయుడు సమన్వయం చేసుకొని విద్యార్థులకు భోజనం పెట్టించకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## లేబర్ కమిషనర్ పేరుతో మోసం

- వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన నిందితుడి అరెస్ట్



నిందితుడు బిల్ల నాగేశ్వర్‌రావు

నల్లగొండ క్రైం: లేబర్ కమిషనర్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న నేరగాడిని నల్లగొండ టూటౌన్ పోలీస్‌లు గురువారం అరెస్టు చేశారు. ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైఎస్సార్ కడప జిల్లా బి. కోడూరు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన బిల్ల నాగేశ్వర్‌రావు బీకాం వరకు చదివాడు. గతంలో అతడు నల్లగొండలోని ఓ ఎరువుల దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేశాడు. అదేవిధంగా స్థానికంగా బత్తాయి, నిమ్మ తోటల్లో మొక్కలను కటింగ్ చేసే పని కూడా చేశాడు. ఆ సమయంలో ఇక్కడి సెల్‌ఫోన్ దుకాణాదారుల ఫోన్ నంబర్లు సేకరించి, సులభంగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో ఆయా షాపుల నిర్వాహకులకు ఫోన్ చేసి తాను లేబర్ కమిషనర్‌ను అని.. షాపులకు లైసెన్స్ లేకుండా ఎలా నడుపుతున్నారని బెదిరించాడు. మొదటిసారి తప్పుగా భావించి రూ.600 జరిమానా వేస్తున్నానని, మరోసారి రిపీట్ అయితే రూ.20వేలు జరిమానా విధిస్తా అని ఫోన్‌పే ద్వారా డబ్బులు వసూలు చేశాడు. వాట్సాప్‌లో లేబర్ సర్టిఫికెట్ పెడుతున్నా.. దానిని షాపులో పెట్టుకోండి అంటూ కొందరు మొబైల్ షాపుల జమానులకు చెప్పాడు. మరికొందరికి ఆఫీసుకు వచ్చి లేబర్ సర్టిఫికెట్ తీసుకోవాలని చెప్పడంతో వారు లేబర్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లగా సంబంధిత అధికారులు మాకేం తెలియదని చెప్పారు. సహాయ లేబర్ కమిషనర్ మాధవరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు బిల్ల నాగేశ్వర్‌రావును గురువారం కడపలో అరెస్ట్ చేసి నల్లగొండకు తీసుకొచ్చి రిమాండ్ చేశారు. నిందితుడిని పట్టుకోవడంలో సహకరించిన పోలీసు కానిస్టేబుళ్లు శంకర్, బాలకోటి, నర్సింహారావు తదితరులను ఎస్సై అభినందించారు.

## వర్మీ కంపోస్ట్ తయారీతో ఉపాధి పొందవచ్చు



అవగాహన కల్పిస్తున్న నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ బాలకృష్ణన్

గరిడేపల్లి: వర్మీ కంపోస్ట్ తయారీ ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చని హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్, సైంటిస్ట్ డాక్టర్ ఎం. బాలకృష్ణన్ అన్నారు. గురువారం మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో షెడ్యూల్ కులాలకు చెందిన రైతులకు వర్మీ కంపోస్ట్ తయారీపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వర్మీ కంపోస్ట్ వినియోగించడం వలన కలిగే లాభాలు, వర్మీ కంపోస్ట్ తయారు చేస్తూ స్వయం ఉపాధి పెంపొందించుకునే మార్గాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త బి. లవకుమార్ మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వాడకం వలన నేల గుల్లబారి, కర్బన శాతం తగ్గిపోయి, భూసారం తగ్గుతుందని అన్నారు. నేలను ఆరోగ్యంగా ఉంచడానికి వర్మీ కంపోస్ట్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఎ. కిరణ్, నరేష్, ఆదర్శ్, మాధురి, సుగంధీ, రైతులు పాల్గొన్నారు.

## జీవ ఎరువులతో అధిక దిగుబడులు

త్రిపురారం: అందుబాటులో ఉన్న పదార్థాలతో రైతులు సొంతంగా జీవ ఎరువులను తయారు చేసుకుని పంటలపై పిచికారీ చేసి అధిక దిగుబడులు సాధించవచ్చని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. కంపాసాగర్ కేవీకేలో ప్రకృతి వ్యవసాయంపై జిల్లాలోని రైతులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం రెండవ రోజు ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా భూమి ఆరోగ్యంతో పాటు జీవవైవిధ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం బెల్లం, శనగ పిండితో జీవామృతం తయారు చేసుకునే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీవామృతం తయారు చేసుకోవడానికి రైతులకు డ్రమ్ము, బెల్లం, శనగ పిండి పంపిణీ చేశారు. రెండు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కేవీకే సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ భరత్, రాములమ్మ రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు డ్రమ్ములు, జీవ ఎరువుల తయారీకి సంబంధించిన పదార్థాలను పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు